క్లుప్తంగా

ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అవగాహన



ఈవీఎంల పనితీరు వివరిస్తున్న తహసీల్దార్

నగరి: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల ద్వారా ఓటు హక్కు వినియోగించుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని మాంగాడు 145,146 పోలింగ్ స్టేషన్లలో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రదర్శనను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి నిర్వహించారు. బుధవారం అఖిలపక్ష నాయకుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన ఈవీఎం, వీవీప్యాట్‌లను వారి ముందు ఉంచి వాటి పనితీరును ప్రత్యక్షంగా వివరించారు. వచ్చేది ఎన్నికల ఏడాది కావడంతో ప్రజలు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈవీఎం యంత్రంపై ఓటువేసే విధానాన్ని స్వయంగా బ్యాలెట్‌పై ఓటువేసి చూపించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు



సహపంక్తి భోజనం చేస్తున్న భక్తులు

నగరి: పట్టణ పరిధిలోని బైపాస్ కూడలి సమీపంలో శ్రీ ధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో బుధవారం అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేశారు. దీంతో ఆలయ ప్రాంగణం అంతా అయ్యప్పస్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. భక్తులు లక్ష్మి, జయచంద్రమేస్త్రి, శివ ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, భక్తులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీకి ఉప ముఖ్యమంత్రి పరామర్శ



పురుషోత్తంను పరామర్శిస్తున్న ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: చిత్తూరు సమీపంలోని చీలాపల్లె సీఎంసీలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న మండల మాజీ ఎంపీపీ, గాండ్ల కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పురుషోత్తంను ఉప ముఖ్యమంత్రి కె.నారాయణస్వామి పరామర్శించారు. బుధవారం ఆస్పత్రికి వెళ్లిన ఆయన పురుషోత్తం ఆరోగ్య పరిస్థితి, వైద్యసేవలపై వాకబు చేశారు. పురుషోత్తంకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లను ఆదేశించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడు పెద్దిరెడ్డి ఉమాచంద్రారెడ్డి, శేషాద్రిరెడ్డి ఉన్నారు.


పథకాలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న డీడీఓ కుమార్

వెదురుకుప్పం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కొమరగుంట గ్రామ సచివాలయం డీడీఓ కుమార్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కొమరగుంట, ఇనాంకొత్తూరు పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం ఆయుష్మాన్ భారత్ కార్డులు, క్యాలెండర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పురుషోత్తం, వ్యవసాయాధికారి వనిత, ఏపీఓ ఇందు, హౌసింగ్ ఏఈ పృథ్వీ, సర్పంచ్‌లు దాక్షాయణి, మమత, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థిని మృతి



పూజ (ఫైల్)

నగరి: పట్టణ పరిధిలోని మూతబడిన శాంతి థియేటర్ సమీపంలో గత నెల 5వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆర్.పూజ (16) అనే విద్యార్థిని నెలరోజుల పాటు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందింది. సీఐ సురేష్ తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు సరిహద్దు కరింబేడుకు చెందిన పూజ షోళింఘర్‌లోని ఒక ప్రైవేటు పాఠశాలలో ఇంటర్మీడియట్ చదువుతోంది. గత నెల 5వ తేదీన దీపావళికి దుస్తుల కొనుగోలుకు నగరికి వచ్చి తిరిగి వెళ్తున్న సమయంలో జరిగిన రోడ్డుప్రమాదంలో గాయాలపాలైంది. ఆమెను చెన్నై స్టాన్లీ ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందించారు. నెలరోజుల పాటు చికిత్స అందించినా పరిస్థితి విషమించడంతో మృతిచెందింది.

ఆపద వేళ.. ఆపన్నహస్తం

- ఆర్‌కే రోజా చారిటబుల్ ట్రస్ట్ తరఫున ముమ్మరంగా సహాయక చర్యలు
- వరద బాధితులకు నిత్యావసర వస్తువులు పంపిణీ
- రోడ్లకు మరమ్మతులు చేసి రాకపోకల పునరుద్ధరణ

కరోనా, ప్రకృతి విపత్కర సమయాల్లో ప్రజలకు అండగా నిలుస్తూ మంత్రి ఆర్‌కే రోజా ఆదర్శంగా నిలుస్తున్నారు. తన చారిటబుల్ ట్రస్టుద్వారా ప్రజలకు సహాయ సహకారాలు అందించడంలో ఎప్పుడూ ముందుంటారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో గానీ, మాండూస్ తుపాన్ సమయంలో గానీ ఆమె ప్రజలకు అండగా ఉండి రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా నగరిలో గతంలో ఎవరూ అందించని సహకారం అందించిన మరువలేము. ప్రస్తుతం మిగ్‌జాం తుపాను విపత్కర పరిస్థితుల్లో కూడా ఆమె వేగంగా స్పందించారు. బాధితులకు తానున్నానంటూ ఆపన్నహస్తం అందించారు. నియోజకవర్గంలో తుపాను బాధిత ప్రాంతాల్లో మంత్రి ఆర్కేరోజా ఆదేశాల మేరకు ప్రజాప్రతినిధులు, అధికారులు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించారు.

నగరి: వరద బాధితులకు సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఆర్కేరోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా నిండ్ర మండలం అత్తూరు, అగరం పేటలోని బాధితులకు నిత్యావసర సరకులు అందిస్తూ సహాయక చర్యలు చేపట్టారు. అలాగే మంత్రి రోజా ఆదేశాల మేరకు అధికారులు వర్షాలకు ఛిద్రమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరించారు. అలాగే వర్షపు నీటి దారి మళ్లింపు చర్యలు, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా, విద్యుత్ తీగలు సరిచేయడం తదితర సహాయక చర్యలను శరవేగంగా చేస్తున్నారు.

పంటల రక్షణకు సలహాలు..

మరోవైపు పంటలు నీట మునిగిన ప్రాంతాల్లో ఏరువాక కేంద్రం సమన్వయ కార్యకర్త రెడ్డిరాము పర్యటించి పొలాల్లో ఉన్న పంటలను కాపాడుకోవడం, నష్టనివారణ చర్యలు చేపట్టడంపై రైతులకు అవగాహన కల్పించారు. నీటిలో మునిగిన వరిపొలాల్లో నీటిని కాలువల ద్వారా వెళ్లిపోయేలా చర్యలు తీసుకోవాలన్నారు. విత్తనం గట్టి పడే దశలో ఉన్న పంటలో విత్తనం మొలకలు రాకుండా 5 శాతం ఉప్పు ద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. ఎకరానికి 25 కిలోల రాళ్ల ఉప్పును వెదజల్లడం ద్వారా మొలకలు రాకుండా అరికట్టవచ్చన్నారు. కళ్లాల్లో ఉన్న ధాన్యం ఒక క్వింటాలుకు ఒక కేజీ ఉప్పును కలుపుకోవడం ద్వారా మొలకలు, రంగుమారకుండా నివారించవచ్చన్నారు. ఎండ వచ్చిన వెంటనే ఆరబెట్టి తూర్పార పట్టాలన్నారు. పూత, పాలుపోసుకునే దశలో ఉన్న పంటలో లీటరు నీటికి ఒక గ్రాము లేదా 2 గ్రాముల కార్బండిజం గానీ, మాంకోజెబ్ కలిపి గానీ, ఒక మిల్లీ లీటరు ప్రొపికొనజోల్ మందును గానీ పిచికారీ చేయాలన్నారు. నారుమడి దశలో ఉన్న వరి పంటలో వారం రోజుల దశలో ఉంటే నీటిని పూర్తిగా బయటకు తీసేయడం వల్ల ఎటువంటి నష్టం జరగదన్నారు. వేరుశనగ పంటలో వీలైనంత త్వరగా నీటిని తీసేస్తే పంటకు ఎలాంటి నష్టం జరగదన్నారు. 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాషియం, ఎరువులు వేసుకున్నట్లయితే పంట తొందరగా రికవరీ అవుతుందన్నారు. చెరుకుపంట నేలకొరిగినట్లయితే వెంటనే నిలబెట్టి జడలు కట్టుకోవాలన్నారు. ఒక ఎకరాకు 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్ వేయాలన్నారు. ఒక లీటరు నీటిలో 5 గ్రాముల పార్ముల-4 కలిపి పిచికారీ చేయాలన్నారు. కూరగాయల పంటలైన వంగ, మిరపలో నీటిని తీసేసిన తరువాత లీటరు నీటికి 5 గ్రాముల 13-0-45 మందు గానీ 19-19-19 గానీ కలుపుకుని వారం వ్యవధిలో పిచికారీ చేయాలన్నారు. ఆకుమచ్చ తెగులు ఆశించే అవకాశం ఉన్నందున ఒక లీటరు నీటిలో 1 మిల్లీలీటరు ప్రొపికొనజోల్ కలుపుకుని పిచికారీ చేయాలన్నారు. ఆయన వెంట జిల్లా రిసోర్స్ సెంటర్ ఏడీఏ నాగపద్మిని, శాస్త్రవేత్త మోహన్ రెడ్డి, విశ్వనాథ్, ఏడీఏ సౌభాగ్యలక్ష్మి, వ్యవసాయ అధికారి రాఘవేంద్ర యాదవ్ పాల్గొన్నారు.



పుత్తూరు: చెర్లోపల్లి రోడ్డు పునరుద్ధరణ పనులు

పుత్తూరులో..

పుత్తూరు: తుపాను బీభత్సవానికి పుత్తూరు పట్టణంలో దెబ్బతిన్న రోడ్లు, కాలువల మరమ్మతులను యుద్ధ ప్రాదిపదికన చేపట్టాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీంతో బుధవారం పుత్తూరు పట్టణ పరిధిలో పలు మరమ్మతులు, సహాయక చర్యలను అధికారులు చేపట్టారు. మున్సిపాలిటీ 21వ వార్డు చెర్లోపల్లి రోడ్డు వర్ష ఉధృతికి మంగళవారం కొట్టుకుపోయింది. బుధవారమే మరమ్మతులు చేపట్టి రోడ్డును పునరుద్ధరించారు. అలాగే చెర్లోపల్లి చెరువుకు గండి పడే ప్రమాదాన్ని గుర్తించి, జేసీబీ సాయంతో మరమ్మతులు చేశారు. చినరాజుకుప్పం దళితవాడలోకి చేరిన నీటిని బయటకు మళ్లించారు. ఈ కార్యక్రమాలను వార్డు కౌన్సిలర్ జ్యోతి, ఈశ్వరయ్యయాదవ్ పర్యవేక్షించారు. 15, 27వ వార్డుల్లోని రైల్వే అండర్ బ్రిడ్జిల్లో నీరు నిలిచిపోయి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మోటార్ల సాయంతో నీటిని బయటకు తోడి రాకపోకలను పునరుద్ధరించారు. కార్యక్రమాలను వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ కృష్ణమరాజు, చక్రి పర్యవేక్షించారు.

వరద బాధితులకు అండగా ఉంటాం

నిండ్ర: మండలంలో తుపాను కారణంగా ఇళ్లు కోల్పోయిన బాధితులకు రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా మంత్రి సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి బుధవారం నిత్యావసర వస్తువులు, ఆర్థిక సాయం అందజేశారు. అందులో అత్తూరు ఎస్టీకాలనీ వాసులకు, డీకే బేడు దళితవాడ ప్రజలు తుపాను వల్ల నష్టపోయారు. మొత్తం 70 కుటుంబాలను పరామర్శించిన రామ్‌ప్రసాద్‌రెడ్డి వారికి అత్యవసరమైన బియ్యం, పప్పు, నూనె నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడుతూ తుపాను వల్ల నష్టపోయిన వారికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎంపీడీఓ అరుణ, తహసీల్దార్ భగవతి, వైస్ ఎంపీపీలు దుర్గాదేవి, శుభ, సింగిల్‌విండో అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సర్పంచ్ చెల్లెమ్మ, మండల కన్వీనర్ వేణురాజు, స్థానిక నాయకులు రమేష్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నిండ్ర: అత్తూరు ఎస్టీకాలనీలో బాధితులకు బియ్యం పంపిణీ చేస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి







నగరి: దామరపాకంలో నీటమునిగిన వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏరువాక కేంద్ర సమన్వయకర్త, అత్తూరు ఎస్టీ కాలనీలో ట్యాంకరు ద్వారా నీటి సరఫరా, పుత్తూరు అండర్ బ్రిడ్జి వద్ద నీటిని తోడేసిన దృశ్యం

హుండీ కానుకల లెక్కింపు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరం గ్రామ దేవతగా, భక్తులకు కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ బంగారమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.1.48 లక్షలు వచ్చినట్లు ఆలయ అధ్యక్షుడు కే.ప్రసాద్ తెలిపారు. బుధవారం ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సమక్షంలో హుండీ కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుండీ ద్వారా వచ్చిన కానుకలను ఆలయ అభివృద్ధికి, ఈ నెల 19, 20 తేదీల్లో జరిగే అమ్మవారి జాతరకు వెచ్చించనున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి, అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థ ప్రసాదాలను పంచిపెట్టారు. కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షుడు రంగనాథమొదలి, కార్యదర్శి చంద్రశేఖర్ పిళ్లై, రాజశేఖర్, తులసి పలువురు పాల్గొన్నారు.



హుండీ కానుకలను లెక్కిస్తున్న కమిటీ సభ్యులు

ప్రతి నీటి బొట్టును కాపాడుకుందాం

కార్వేటినగరం: జలాశయంలోని ప్రతి నీటి బొట్టును ఆయకట్టులోని చెరువులకు చేరేలా చూడాలని ఎంపీపీ లత అన్నారు. వరద నీటితో జలకళ సంతరించుకున్న కృష్ణాపురం జలాశయాన్ని సందర్శించి, జలహారతి పట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ లత మాట్లాడుతూ ప్రతి నీటి బొట్టు చెరువులకు చేరేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చొరవతో కృష్ణాపురం జలాశయాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. జలాశయం గేట్ల ద్వారా నీటిని విడుదల చేయక ముందే కుశస్థలి నదీ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాలను సైరన్ మోగించి అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జలాశయం పరిసర ప్రాంతాలను పరిశీలించి అనుమతులు లేకుండా సందర్శకులు రాకుండా చూడాలని తెలిపారు. ప్రతి నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటూ పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, మండల మాజీ కన్వీనర్ ధనంజయవర్మ, సర్పంచ్ ధనశేఖర్‌వర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ పురంధర్, ఎంపీడీఓ మోహన్‌మురళి పాల్గొన్నారు.



కృష్ణాపురం జలాశయానికి జలహారతి పడుతున్న ఎంపీపీ లత

నేడు మంత్రి రోజా పర్యటన

నగరి: నగరి మున్సిపల్ పరిధిలో గురువారం మంత్రి ఆర్‌కే రోజా పర్యటించనున్నారు. ఉదయం 9 గంటలకు కరకంతాపురం, కరకంతాపురం దళితవాడలో గడపగడపకు ప్రభుత్వ నిధులతో నూతనంగా నిర్మించే సిమెంటు రోడ్డుకు భూమిపూజ చేస్తారు. అనంతరం నెత్తంకండ్రిగలో తుపాను బాధితులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తారు.

ఫిజియోథెరపీతో మేలు



ఫిజియోథెరపీ చేస్తున్న డాక్టర్ అనూష

పాలసముద్రం: మండల పరిధిలోని 6-14 సంవత్సరాలలోపు పిల్లల్లో అంగవైకల్యం ఉంటే వారికి ఫిజియోథెరపీ చేయించడం ద్వారా త్వరగా కోలుకునే అవకాశం ఉందని ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. బుధవారం 10 మంది పిల్లలకు డాక్టర్ అనూష ఫిజియోథెరపీ వైద్యసేవలు అందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ కూర్చోవడానికి, నిలబడడానికి, నడవడానికి శారీరకంగా, మానసికంగా ఇబ్బంది ఉన్న పిల్లలను ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉచిత ఫిజియోథెరపీ సెంటరుకు తీసుకొచ్చి వైద్యసేవలు పొందాలని తెలిపారు. ఫిజియోథెరపీ క్యాంపులో చేయించే వ్యాయామాలను ఇంటి వద్ద తల్లిదండ్రులు క్రమం తప్పకుండా పిల్లలతో చేయిస్తే త్వరగా నయం అవుతుందన్నారు. ప్రతి బుధవారం ఫిజియోథెరపీ క్యాంపు జరుగుతుందని, తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి





నగరి: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జడ్జి, అంబేడ్కర్ విగ్రహానికి దళితసంఘాల నేతల నివాళి

నగరి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జడ్జి విష్ణువర్మ పూజలు అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టులో అంబేడ్కర్ చిత్రపటానికి పూజలు చేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు ఏపీపీ రామ శాంతి, బార్ అసోసియేషన్ ఉపకార్యదర్శి రాము, కోశాధికారి నాగరాజు, న్యాయవాదులు ఎం.బాబు, ఈజీ బాబు, లోకేష్, మురళీకృష్ణ, కె.తిరుమల, మహేష్, అరుణ్, ప్రకాష్, వెంకీ, ధరణి తదితరులు పాల్గొన్నారు. అలాగే దళితసంఘాల ఆధ్వర్యంలో నగరి అంబేడ్కర్ సర్కిల్, మండపం, కాకవేడు తదితర ప్రాంతాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ కార్యదర్శి గోవిందస్వామి, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ప్రభుత్వం

కార్వేటినగరం: వరద బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. బుధవారం మండల పరిధిలో తుపాన్‌లో దెబ్బతిన్న పంటలు, ఇళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ ప్రకృతి విపత్తులో దెబ్బతిన్న పంటలకు బీమా కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, ప్రతి రైతు దెబ్బతిన్న పంటల వివరాలను వారి గ్రామంలోని రైతుభరోసా కేంద్రం సిబ్బందికి సమాచారం అందించి నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే తుపాను వల్ల ఇళ్లు కూలిపోయిన వారిని వలంటీర్లు విధిగా గుర్తించి వారి వివరాలను సంబంధిత వీఆర్‌ఓ, కార్యదర్శుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు. తుపాన్ బాధిత కుటుంబాలను ఆదుకోవడానికి వలంటీర్లు కృషి చేయాలన్నారు. అనంతరం ఆయన కార్వేటినగరంలో కూలిపోయిన పెంకుటిల్లును సందర్శించి అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఆయన వెంట వీఆర్‌ఓ బాలుసింగ్ ఉన్నారు.



కార్వేటినగరం: కుమ్మరగుంట వద్ద కూలిన ఇంటిని పరిశీలిస్తున్న బాలాజీ

చిరస్మరణీయుడు అంబేడ్కర్







పుత్తూరు: నివాళులు అర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ హరి, వడమాలపేట: అంబేడ్కర్‌కు నివాళులు అర్పిస్తున్న నేతలు, పెనుమూరులో..

పుత్తూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ చిరస్మరణీయులని మున్సిపల్ చైర్మన్ ఎ.హరి అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ డి.శంకర్, కౌన్సిలర్ చిట్టిబాబు, టీపీఓ మూర్తి, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం స్థానిక నగరం రోడ్డు సర్కిల్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

వడమాలపేటలో..

ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు జయంత్‌బాబు ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని వడమాలపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డేవిడ్, దేవరాయలు, వెంకటస్వామి, ధర్మతేజ, దాము, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

రాజ్యాంగ నిర్మాతకు ఘన నివాళి

గంగాధర నెల్లూరు: మండలం కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థానిక సర్పంచ్ వీసీ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణకర్త డిల్లీకుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి భారీ గజమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు నిరుపమానమని, అంబేడ్కర్ ఆశయాల కోసం, సిద్ధాంతాల కోసం కట్టుబడి ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.



శ్రీరంగరాజపురంలో..,

అంబేడ్కర్‌కు నివాళి

పెనుమూరు(కార్వేటినగరం): రాజ్యాంగ పితామహుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా పెనుమూరు మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజయకుమార్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు యశోదారెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, జిల్లా కార్యవర్గ సభ్యులు దూది మోహన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు దాము, ఇతర నాయకులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి జిల్లా ఇన్‌చార్జ్ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ రవిరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ పౌరులమైన మనమంతా అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ బెన్నురాజు, ఎంపీడీఓ కృష్ణయ్య, స్థానిక సర్పంచ్ కుప్పయ్య, సమాచార హక్కు చట్టం జిల్లా ప్రధాన కార్యదర్శి పుల్లూరు కుప్పయ్య, దళిత నాయకులు పాల్గొన్నారు.



పాలసముద్రంలో..

పాలసముద్రంలో..

పాలసముద్రం: పాలసముద్రం దళితవాడలో మండల కన్వీనర్ తులసీరామ్ యాదవ్, జెడ్పీటీసీ సభ్యులు అన్బళగన్, సర్పంచ్ అయ్యప్ప, స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏఎస్‌ఐ మురుగేష్ తదితరులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. మండల కన్వీనర్ తులసిరామ్ యాదవ్ మాట్లాడుతూ డాక్టర్ అంబేడ్కర్ అంటరానితనాన్ని సమూలంగా నిర్మూలించారని కొనియాడారు. నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన

పుత్తూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల గురించి గ్రామీణ ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కృష్ణసముద్రం గ్రామ సర్పంచ్ ఆర్.దయా సూచించారు. బుధవారం పుత్తూరు మండలం కృష్ణసముద్రం పంచాయతీలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పీఎం కిసాన్ సమ్మాన్, ఆయుష్మాన్ భారత్, పీఎం ఉజ్వల యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డ్రోన్ ద్వారా పంటలకు మందుల పిచికారీ చేసే విధానాన్ని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్యామ్, వ్యవసాయ శాఖ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సాంస్కృతిక ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి

వెదురుకుప్పం: దివ్యాంగులు అన్నిరంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయురాలు లీలావతి అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం మండలంలోని పచ్చికాపల్లం భవిత కేంద్రంలో తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమం కోరకు అన్నివిధాలా తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలన్నారు. అనంతరం సమగ్ర శిక్ష అభియాన్ ద్వారా అందిస్తున్న పథకాలను వివరించారు. చివరిగా దివ్యాంగ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్యామల, రాజశేఖర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం లీలావతి